# అగ్ని పర్వతం

వసుంధర

శ్రీరాములు ఆఫీసు నుంచి వచ్చేసరికి వంటింట్లోంచి పరిమళాలు గుబాళిస్తున్నాయి.

"సీతా!" అన్నాడతను.

అప్పుడు సీత లోపల్నుంచి అక్కడకు వచ్చింది. జడ నిండా మల్లెలు తురుముకున్నదేమో శ్రీరాములు నాసికా పుటాలకిప్పుడు మరో పరిమళాలు విందు చేస్తున్నాయి.

"మీరు వస్తారని తెలుసు. తలుపులు తీసే వుంచాను" అందామె తమాషాగా నవ్వుతూ.

శ్రీరాములూరికి వెళ్ళి అప్పుడే తిరిగివస్తున్నాడు.

"ఇలా రా!" అన్నాడతడు.

సీత దగ్గరగా వచ్చింది.

అప్పుడతడికి సోకినవి వంటల గుబాళింపూ కాదు, మల్లెల గుబాళింపూ కాదు.

ఆమె శరీరంనుండి యేదో వింత పరిమళం!

శ్రీరాములామెను దగ్గరగా తీసుకోవాలనుకున్నవాడే

యెందుకో నిగ్రహించుకున్నాడు.

"త్వరగా బట్టలు మార్చుకోండి. మీకోసం మసాలా ఉప్మా చేశాను. చల్లారేలోగా...."

ఆమె యేదో అనబోతూండగా—"పిల్లలేరీ!" అన్నాడతను.

సీత యౌవనం తరగనిది. ఆమెను చూస్తే అప్పుడే పెళ్ళయిందా అనిపిస్తుంది. కానీ ఆమె నలుగురు పిల్లల తల్లి. పెద్దవాడికి పదేళ్ళు. రెండోదానికి ఎనిమిది. మూడోవాడికి ఏడు. నాలుగో వాడికి అయిదు. ఎవరైనా పిల్లల్నీ ఆమెనీ కలిపిచూస్తే వాళ్ళామె అక్కపిల్లలా అనుకుంటారు.

"ఆడుకుందుకు వెళ్ళారు...." అంది సీత. అతడు తన్ను దగ్గరగా తీసుకుందుకు తటపటాయించడానికి కారణం తెలిసిన దానిలా ఆమె అతడికి మరింత దగ్గరగా జరిగింది.

శ్రీరాములామెను తాకనైనా తాకలేదు. కానీ పరిశీలనగా ఆమెవైపే చూస్తూ—"మన పెళ్ళై పన్నెండేళ్ళయింది. పదహారోయేట నువ్వు నా అర్ధాంగివయ్యావు. ఇప్పుడు చూస్తూంటే పెళ్ళినాటికన్నా చిన్నపిల్లలాగున్నావు. నీ ముఖంనిండా అమాయకత్వం. కానీ నువ్వు అమాయకురాలివి కాదని నాకు తెలుసు—" అన్నాడు.

"ఏమిటండీ — ఇలా మాట్లాడుతున్నారు!" అంది సీత.

"నీ ముఖం చూస్తూంటే పసితనపుటమాయకత్వం గోచరిస్తుంది. నువ్వు నాతో పన్నెండేళ్ళు కాపురంచేసి నలుగురు పిల్లల తల్లి వయ్యావంటే నాకే నమ్మబుద్ధి కావడంలేదు. కానీ అది నిజం. అవునా?"

అది తనకు పొగడ్తగా తీసుకుని—"అయితే?" అంది సీత ఉత్సాహంగా.

"అంటే నీ ముఖంలో కనబడే అమాయకత్వం నిజం కాదు. నటన!" అన్నాడు శ్రీరాములు.

"ఏమిటండీ—ఇలా మాట్లాడుతున్నారు!" అంది సీత మళ్ళీ.

"హైదరాబాద్‌లో నేను కృష్ణమోహన్ని కలుసుకున్నాను...."

కృష్ణమోహన్ సీతకు స్వయానా బావ. వయస్సులో అతడు శ్రీరాములికంటే రెండేళ్ళు పెద్ద. చూడ్డానికి పదేళ్ళు చిన్నలా అనిపిస్తాడు.

"ఊఁ" అంది సీత.

శ్రీరాములు కాసేపు మాట్లాడలేదు.

సీత అతడి వంకే చూస్తోంది. అతదేం చెప్పబోతున్నదీ ఆమె కర్థమవుతున్నట్లు లేదు.

"ఎనిమిదేళ్ళ క్రితం అతడీ ఊళ్ళోనే వుండేవాడు—గుర్తుందా?"

"ఏమో!" అంది సీత.

"అదే నటన అంటే! ఏజా—ఏమిటి? ఈ ఊరు రాగానే అతడు మనింటికే వచ్చి తనకిల్లు దొరికేదాకా రెండు నెలలు మనింట్లోనే వున్నాడు. ఆ తర్వాత రోజూ వస్తూ పోతూ వుండేవాడు...."

"అవును — గుర్తొచ్చింది. బావకు మొహమాటం యొక్కువ. మీరు బాగా బలవంతపెట్టి ఒప్పించారు-" అంది సీత వెంటనే.

"అదీ తెలివి అంటే! ఎవరతణ్ణి మనింటికి రమ్మన్నారో నువ్వు విడమర్చి చెప్పనవసరంలేదు. నేను బల

వంత పెట్టినప్పటికీ అతడు మనింట్లో రెండు నెలలుండడమేకాక నాలుగేళ్ళపాటు తరచుగా వస్తూ పోతూండేవాడంటే కారణం_నువ్వు, నీ ఆదరణ. కాదంటావా?"

సీత బదులివ్వలేదు. భర్త వంక చురుగ్గా చూసింది.

"నీ చూపులే చెబుతున్నాయి, కాదనలేవు. అవునా?"

"ఆదరణకు మారు పేరు నేను. నా పేరు సీత!" అందామె.

"ఆదరణకు మారు పేరువే నువ్వు. అందుకే నీ పేరు సీత కాదు—అహల్యగా మార్చుకుంటే బాగుంటుంది."

"ఎందుకు?"

"వివాహిత స్త్రీ పరపురుషుణ్ని భర్తకుమించి ఆదరిస్తే ఆమె అహల్య అవుతుంది."

"ఏమిటండీ మీరనేది?" బాధగా అంది సీత.

"నీకూ నీ బావకూ సంబంధముంది!"

"ఏమిటీ?" అంది సీత. అంతకుమించి ఆమెకు గొంతు పెగలలేదు.

"మనింట్లో పెరుగుతున్న చివరిద్దరు పిల్లలూ నా పిల్లలు కారు...."

"ఇలాంటి వేళాకోళాలు నాకు నచ్చవు...." చిరాగ్గా అంది సీత.

"నీకు నచ్చని వేళాకోళాలు నేనెప్పుడూ చేయను."

"మరిప్పుడు....?"

"నేను సీరియస్‌గా చెబుతున్నాను..."

"ఏమిటండీ యిదంతా?"

"మాటిమాటికీ ఏమిటండీ, ఏమిటండీ అనకు. పెళ్ళికి ముందే నువ్వూ, నీ బావ ప్రేమించుకున్నారు. కానీ మీ రెండు కుటుంబాలకీ మధ్య కలహాలు రేగడంతో మీ

వెళ్ళి సాధ్యపడలేదు. పెళ్ళయ్యాక నీ బావ ఈ వూరొచ్చాడు. ఇద్దరు పిల్లల తల్లివైనా నీ బావకు నీలో పాత ప్రియురాలే కనిపించింది. అతడు నిన్ను ప్రోత్సహించాడో, నువ్వతడికి సహకరించావో నాకు తెలియదు. నాకు తెలియకుండా మీరిద్దరూ నా యింట్లోనే కాపురం చేశారు. నీ బావ నిన్ను ఇద్దరు పిల్లల తల్లిని చేశాడు."

"ఇదంతా మీ కెవరు చెప్పారు?"

"నీ బావ!"

తెల్లబోయింది సీత—"ఎందుకు చెప్పాడు?"

"చెప్పినట్లతడికి తెలియదు."

"మీరు చెప్పేదంతా డొంకతిరుగుడుగా వుంది. నాకేమీ అర్థంకావడంలేదు."

"నీకు తెలిసిన విషయమేకదా యెలా చెప్పినా అర్థమవుతుందనుకున్నాను. సూటిగా కావాలంటే అలాగే చెప్పగలను. కాస్త దూరంగా అలా కూర్చో! నేను నిలబడి అటూ యిటూ పచార్లు చేస్తూ యేం జరిగిందో చెబుతాను."

సీత చటుక్కున అతడికి దూరంగా వెళ్ళి నేలమీదనే చతికిలబడింది.

శ్రీరాములు అటూ యిటూ పచార్లు ప్రారంభించాడు:

అక్కడ కాసేపు నిశ్శబ్దం

అప్పటికే సీత శరీరం పరిమళించడం మానేసింది. ఆమె తలలోని మల్లెలు వాడిపోయాయి. వంటింటి గుబాళింపు ఇగిరిపోయింది.

శ్రీరాములు చెప్పడం ప్రారంభించాడు.

"నేను కృష్ణమోహన్ని కలుసుకోవాలనుకోలేదు. అతడే వెతుక్కుంటూ వచ్చి నన్ను కలుసుకున్నాడు. నీ

క్షేమ సమాచారాలు పదేపదే అడిగాడు. యేడాదిక్రితం అతడి భార్య పోయింది. అప్పట్నించీ అతడికి పిచ్చిపట్టినట్లూంటోందిట. ఒంటరితనం బాధపెడుతోందిట. నన్ను వాళ్ళింటికి పిలిచాడు. ఇల్లు పెద్దది. ఒక్కడే మనిషి. భార్యతో పట్టుమని అయిదేళ్ళు కూడా కాపురంచేసినట్లు లేదు. ఆమె ఫోటోలు చూపించాడు. మనిషి అందమైనదే....కానీ నీ అంతకాదు. అతడితో యేంమాట్లాడాలో నాకు తెలియలేదు. అతడే నాకు తాగుడు ఆఫర్ చేశాడు. నేను తాగనని చెప్పినా వినలేదు. ఫలితంగా నేను తాగినట్లు నటించాను. అతడు తాగాడు. నేను తాగుతున్నానో లేదో పట్టించుకోకుండా తను విపరీతంగా తాగాడు. కాసేపటికి అర్థంలేని వాగుడు మొదలయింది. అందులోంచి ఈ నిజం బైటపడింది.”

“మీరు కూడా తాగారేమో! మీరు విన్నాననుకున్నది మీ భ్రమేమో!”

“సీతా—ఇంతవరకూ పడ్డ భ్రమ చాలు నాకు!”

“అయితే ఇప్పుడేమంటారు?”

“నేనేమీ అనను. నువ్వే అనాలి!”

“ఏమనను?”

“ఇప్పుడే కదా—నీకు మాత్రమే తెలిసిన నిజం నాకూ తెలిసిందని నీకు తెలిసింది! దీనికి బదులేమిటో బాగా ఆలోచించుకో. ఆలోచించుకుని నాకు చెప్పు.”

“మీరు నిజమంటున్నది అబద్ధమని నేనంటే మీరు నమ్మతారా?” అంది సీత.

“నమ్మను.”

“రుజువులు చూపిస్తే!”

“నేను రుజువులు చూసే వస్తున్నానన్న విషయం

నువ్వు గ్రహించాలి."

"మీరు ఋజువులు చూడలేదు. విన్నారు."

"విన్నవి చెప్పాను. చూసినవి కూడా చెప్పాలా?"

"చెప్పండి. ఇన్ని విన్నదాన్ని అవీ వింటాను."

"నీ బావ నీమీద ప్రేమతో నీ ఫోటోలు కోరాడు. అతడిమీద ప్రేమతో అతడు కోరినవిధంగా నువ్వు ఫోజు లిచ్చావు. అతడు ఫోటోలు తీసుకున్నాడు."

సీత తెల్లబోయినట్లు తెలిసిపోతోంది.

"ఆ ఫోటోలు చూసి నేనూ తెల్లబోయాను. ఎటొచ్చీ నీ శరీరంలో అణువణువూ తెలిసిన నాకా ఫోటోలు నీవే ననటానికి సందేహంలేదు."

సీత యేడ్వడం ప్రారంభించింది.

"ఏడవకు. తప్పులు జీవితంలో అంతా చేస్తారు. కానీ మనం కలిసి పన్నెండేళ్ళు కాపురం చేశాం. నువ్వింతేనా నన్నర్థం చేసుకున్నది? నువ్వు చేసిన యేలాంటి తప్పైనా నేను క్షమించడానికి సిద్ధం! నీలో తాత్కాలిక బలహీనత యేర్పడితే అందుకు నా లోపం కూడా ఉండి వుండాలి. మనం ఒకరినొకరు సానుభూతితో అర్థం చేసుకోవాలి. నేను నిన్ను ఇంట్లోంచి గెంటివేయబోవడంలేదు. నేను నీకు విడాకు లివ్వబోవడంలేదు. మనం యెప్పటికీ కలిసే ఉంటాం. అయితే ఒక్క విషయం నన్ను బాధిస్తోంది. నువ్వు నన్ను మోసం చేశావు. నీ తప్పుల్ని నేను క్షమించగలను. కానీ మోసాన్ని భరించలేను."

"తప్పుకీ మోసానికీ తేడా యేమిటి?"

"అనుకోకుండా నీవల్ల తప్పు జరిగితే అది వెంటనే నాకు చెప్పాలి. అప్పుడు నేను నిన్ను క్షమిస్తాను. ఆ తప్పు దాచిపెడితే అది మోసం!"

"అయితే చెబుతున్నాను వినండి. నేను తప్పు చెయ్యలేదు. కాబట్టి మోసమూ చెయ్యలేదు" గంభీరంగా అంది సీత.

"తగిన సాక్ష్యాధారాలు లభించడంవల్ల నేరం ఋజువై పోయింది. ఇప్పుడు కధను పునస్సమీక్షించము. మన మాలోచించవలసింది తీర్పు గురించి మాత్రమే!"

"అయితే మీ తీర్పేమిటి?"

"ఈ విషయంలో నేను నీ సలహా కోరుతున్నాను. అందుకు నీకు వారం రోజుల వ్యవధి ఇస్తున్నాను."

## 2

ఆ రాత్రి సీత వేరే పడుకుంది. ఆమె ఆలోచనలు గతం చుట్టూ తిరుగుతున్నాయి.

కృష్ణమోహన్ ఆ ఊరొచ్చేముందు వరకూ యెంతో సాఫీగా సాగిపోయింది తన జీవితం. మంచి ఉద్యోగంలో, చక్కటి హోదా వున్న భర్త....ముచ్చటైన పిల్లలిద్దరు....

అసలిప్పుడిక పిల్లలు వద్దనే తాననుకుంది. శ్రీరాములు మాత్రం కనీసం నలుగురైనా పిల్లలుండాలి అనేవాడు. సీత మాత్రం నెమ్మదిగా అతడికి నచ్చచెప్పాలనుకుంది.

కానీ....

కృష్ణమోహన్ శ్రీరాములు ఆఫీసులో ముగ్గురాడ పిల్లలతో అక్రమ సంబంధం పెట్టుకున్నట్లు సీతకు చెప్పాడు. అందుకు తిరుగులేని ఋజువులూ, సాక్ష్యాలూ సంపాదించి పెట్టాడు.

సీతకు కళ్ళు తిరిగిపోయాయి. ఆమె భర్తను నిలదీసింది.

భర్త ముందు కాదన్నాడు. తర్వాత దబాయిం

చాడు. చివరకు "మగాణ్ని, నా యిష్టం" అన్నాడు.

"పవిత్రత ఆడదానికే కాదు, మగాడికీ వుండాలి" అంది సీత.

"మరి నేను పవిత్రుణ్ని కాదుగా! అందుకని పోనీ నువ్వు కూడా మనింటికి వస్తూ పోతూంటే నీ బావతో కలుసు. కాదన్నానా?" అన్నాడు శ్రీరాములు.

సమాజం ఆడదాన్నెంతగా అణచి ఉంచిందో తెలియడం వల్ల నేమో—చాలామంది మగాళ్ళు భార్యలపై ఇలాంటి సవాళ్ళు విసురుతూంటారు.

"ఛా—అదేం మాటలండీ" అంది సీత.

"అమాయకంగా మాట్లాడకు. ఇప్పటికే మీ ఇద్దరికీ యే సంబంధం లేదని నన్ను నమ్మమంటావా?" అన్నాడు శ్రీరాములు.

"మీరు నమ్మకపోతే అబద్ధం నిజం కాదు."

శ్రీరాములు నవ్వి "ఎలాంటి ఋజువులున్నా నేను నిన్ను నమ్ముతాను. అలాగే నువ్వూ నన్ను నమ్మాలి. భార్యాభర్తలకు నమ్మకం ముఖ్యం" అన్నాడు.

"ఋజువులుంటే మీరూ నన్ను నమ్మకండి. ఇకమీదట మీరు మీ ప్రవర్తనను సరిదిద్దుకోండి" అంది సీత.

"నా ప్రవర్తన గురించి ఒక్క ముక్క మాట్లాడినా నేను సహించను. ఆఫీసులో నేనెలాగుంటున్నానూ అన్నది నీ కనవసరం. ఆఫీసునుంచి వచ్చిన మగాడినెలా ఆదరించాలీ అన్నదే నీ బాధ్యత. ఇల్లు నీ పరిమితి. నీ పరిమితులు తెలుసుకుని మసులుకో" అన్నాడు శ్రీరాములు.

"లేకపోతే!"

"లేకపోతే నేను నీ ప్రవర్తనను తప్పుపడతాను."

శ్రీరాములామెను దారుణంగా బెదిరించాడు,

మగాడు తప్పుచేస్తే సమాజమతణ్ని క్షమిస్తుంది. ఆడది తప్పుచేస్తే ఆమెను నిలువ నీడ లేకుండా చేస్తుంది సమాజం. మగాడు తప్పుచేసి చేయలేదని బుకాయిస్తే అంతా నమ్ముతారు. ఆడదానిపై అబద్ధపుటారోపణ వస్తే చాలు—సమాజమామెను వన్యమృగంలా వేటాడుతుంది.

సీత తన బాధను కృష్ణమోహన్‌కు చెప్పుకుంది. కృష్ణమోహన్ ఆమెలో భర్తపట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టాడు.

"నీ భర్తను నువ్వేం చేయలేవు. అందువల్ల మానసికంగా అతడంటే నీకు ఏహ్య భావం కలుగుతుంది. ఫలితంగా మీ కాపురం నరకమవుతుంది. నువ్వతడిమీద ప్రతీకారం సాధించు. అప్పుడు నీ మనసు తేలికగా ఉంటుంది" అన్నాడు కృష్ణమోహన్.

"ప్రతీకారమంటే ఏం చేయాలి?"

"ప్రతీకారంలో కరుణను కలిపితే—కరుణ నాపైనా ప్రతీకారం నీ భర్తపైనా అవుతుంది"

ఏం చేయాలో సీత కర్థమయింది.

"తప్పుకదూ!" అంది సీత.

"నీ భర్తను తప్పుచేయకుండా ఆపలేవు. నువ్వూ తప్పుచేశావనుకో. అప్పుడు నీలో తప్పుచేశానన్న అనుభూతి కలిగి—అతణ్ని క్షమించగల్గుతావు."

"కానీ తప్పు కూడా చేస్తున్నానుగా!"

"తప్పు చేస్తున్నానన్న అనుభూతి నీలో ఉండవచ్చు కానీ నిజానికి ప్రతీకారం తప్పుకాదు."

పెళ్ళికి ముందు సీత కృష్ణమోహన్ అంటే ఇష్టపడింది. ఇద్దరికీ బాల్యంనుంచీ పరిచయముంది. కృష్ణమోహన్ తెలివిగా ఆమెను ప్రోత్సహిస్తున్నాడు.

సీత అతడికి లొంగిపోయింది.

తప్పు ఒకసారే తటపటాయించేలా చేస్తుంది.

భర్తపై ప్రతీకారం తీర్చుకుంటున్నానని ఆత్మవంచన చేసుకుంటూ సీత కృష్ణమోహన్‌తో మూడేళ్ళు వ్యవహారం నడిపింది. భర్తమీద ద్వేషంతో ఆమె తన అభీష్టానికి వ్యతిరేకంగా మరో యిద్దరు పిల్లల తల్లి అయింది.

ఆమె తప్పుకు కృష్ణమోహన్ ప్రతీకారం అన్న పేరు పెట్టాడు. కానీ అది తప్పేనని సీతకు తెలుసు. అయితే ఆ తప్పు ఆమెను భర్తకు దూరం కాకుండా చేసింది. భర్త తప్పులు చేస్తున్నా అతడికామెపట్ల అనురాగం పెరగసాగింది.

ఆడది భర్త తప్పుల్ని క్షమించగలిగినట్లు తన తప్పులు క్షమించుకోలేదు. కృష్ణమోహన్ కారణంగా సీత శ్రీరాములు జీవితకాలంపాటు చేసే తప్పుల్ని క్షమించ గల మానసిక స్థితికి వచ్చేసింది.

కృష్ణమోహన్ ఆ ఊరొదిలి వెళ్ళిపోయాక వారి సంసార జీవితం మరింతత సాఫీగా సాగిపోతోంది.

ఇప్పుడు కృష్ణమోహన్ వారి జీవితంలో కలతలు సృష్టించాడు. ఇలా జరుగుతుందని ఆమె ఊహించలేదు.

శ్రీరాములు తెలుసుకున్నదంతా నిజం! కానీ సీత తన ప్రాణంపోయినా ఆ నిజాన్నొప్పుకోదు శ్రీరాముల ముందు.

శ్రీరాములు సీతకు వారం రోజుల వ్యవధి నిచ్చాడు. ఈలోగా యేదో చేయాలి.

మర్నాడు సీత "స్టార్టు ఇమ్మీడియెట్లీ" అని కృష్ణ మోహన్‌కి టెలిగ్రాం ఇచ్చింది.

# 3

అది ఉదయం పదకొండు గంటల సమయం.

శ్రీరాములు ఆఫీసుకు వెళ్ళాడు. పిల్లలు నలుగురూ స్కూలుకి వెళ్ళారు.

డ్రాయింగ్ రూంలో యెదురెదురు కుర్చీల్లో కృష్ణ మోహన్, సీత కూర్చుని వున్నారు.

సీత ముఖం గంభీరంగా ఉంది.

కృష్ణమోహన్ ముఖంలో ఉత్సాహం తొంగి చూస్తూంది.

"నువ్వు నా కాపురంలో నిప్పులు పోశావు" అంది సీత.

"అవును."

"ఎందుకిలా చేశావు?"

"సీతా — నాకు నువ్వు కావాలి."

"కానీ నాకు పెళ్ళయింది. నలుగురు పిల్లలు."

"మొదటి యిద్దర్నీ నీ భర్తకు విడిచిపెట్టి విడాకులు తీసుకో. చివరి యిద్దర్నీ తీసుకుని నా దగ్గరకు వచ్చేయి. నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను."

"నాకు పెళ్ళయింది. మళ్ళీ పెళ్ళెందుకు?"

"మరి నాకు భార్య పోయిందిగా!"

"అయితే భర్తపోయిన మరో అమ్మాయిని వెతికి పెళ్ళిచేసుకో."

"సీతా! నాకు నువ్వంటే యిష్టం. నీకూ నేనంటే యిష్టం. నా పిల్లలిద్దరు నీ దగ్గర పెరుగుతున్నారు."

"జరిగింది మర్చిపో."

"మర్చిపోయి ఏం చేయను?"

"ఏంచేసినా మళ్ళీ నా జీవితంలో అడుగుపెట్టాలను

కోదు.”

“అలాగనకు సీతా! నాకు నువ్వు కావాలి!”

“కానీ నువ్వు నాకు వద్దు. అగ్నిసాక్షిగా నా మెడలో తాళికట్టిన భర్త శ్రీరాములు. నా ప్రాణం పోయేవరకూ అతడే నా భర్త. అతడు తప్పుచేశాడన్న కోపంతో నేనూ తప్పుచేశాను. నా ప్రతీకారం అయిపోయింది. ఇక నువ్వు నామీద ఆశలు పెట్టుకోకు. ఇది నా నిర్ణయం. నీకు హెచ్చరిక!”

“అయితే నువ్వు నన్నెందుకు పిలిపించినట్లు?”

“వెళ్ళి నా భర్తకు చెప్పు. నువ్వు చెప్పిన మాటలూ, చూపించిన సాక్ష్యాలూ అన్నీ అబద్ధమని నా భర్తను నమ్మించు.”

“అలా చేయడానికే అయితే నేను నీ భర్తనెందుకు కలుసుకుంటాను? మనకు సంబంధించిన నిజాలన్నీ ఎందుకు చెబుతాను?”

“తాగుడు మైకంలో యేమైనా అనొచ్చు. చేయొచ్చు. అది తప్పుగా గ్రహించి సవరించుకోవాలి.”

“నేను తాగను. నా యింట్లో తాగుడుకు సంబంధించిన పదార్థాలేమీ ఉండవు. ఉన్నవల్లా సీసాలు. సీసాల్లో ఫలరసాలు. నేను తాగినట్లు నటించాను. తాగుడు మైకాన్ని అభినయించాను. కావాలనే శ్రీరాములుకు మన గురించిన నిజాలు చెప్పాను.”

సీత కళ్ళెర్రబడ్డాయి.

“నా భర్త తప్పుల్ని క్షమించాను. నిన్ను మాత్రం ఈ జీవితంలో క్షమించలేను. తక్షణం బైటకు వెళ్ళు. నీకు నామీద ప్రేమాభిమానాలున్నాయనుకుంటే మా వారికి నా గురించి మంచిగా చెప్పు. నా మంచితనం

గురించి వారిని నమ్మించు. అలా చేయకుండా మరోసారి నా కళ్ళబడ్డావో నేను నిన్ను హత్య చేస్తాను."

కృష్ణమోహన్ అదోలా నవ్వి—"నీ పవిత్రత చిత్రమైనది. అర్థంలేనిది. నీకు పెళ్ళయ్యాకే నువ్వు నా దానివయ్యావు. ఇప్పుడిలా యెందుకు మాట్లాడుతున్నావో నాకు తెలియడంలేదు. పెళ్ళయ్యాక నాతో వ్యవహారం నడిపినదానివి—నన్ను పెళ్ళి చేసుకుందుకు నీకేమభ్యంతరం? నేనేం తప్పుగా మాట్లాడలేదే! నిన్ను సగౌరవంగా, భార్య స్థానంలో నా జీవితంలోకి ఆహ్వానిస్తున్నాను-" అన్నాడు.

"గెటౌట్!" అంది సీత.

"నా మాట విను" అన్నాడు కృష్ణమోహన్.

"ఐసే గెటౌట్!" అంది సీత.

అప్పుడు సీత యే క్రూరమృగంలాగో కనబడితే కృష్ణమోహన్ భయపడి ఉండేవాడు కాదు.

దేవతో, దెయ్యమో—ఆమె అతడికి మానవాతీత శక్తిలా కనబడింది.

కృష్ణమోహన్ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

## 4

"వారం రోజులూ అయిపోయాయి. నువ్వింకా నాకు నీ సలహా చెప్పలేదు" అన్నాడు శ్రీరాములు.

"బావ మిమ్మల్ని కలుసుకోలేదా?"

"అతగాడు నన్ను కలుసుకున్నాక నే కదా నేను సలహా అడిగాను."

"ఆ తర్వాత?"

శ్రీరాముడామె వంక చురుగ్గా చూసి—"నువ్వతణ్ణి కలుసుకున్నావా?" అన్నాడు.

"అవును. టెలిగ్రాం కొట్టి రప్పించాను."

"ఎందుకు?"

"మీకు నిజం చెప్పగలిగినది అతనొక్కడే!"

"చెప్పేవాడుగా పాపం!"

"చెప్పింది నిజం కాదు."

"సాక్ష్యాలు కూడా వున్నాయి."

"అబద్ధాన్ని నిజం చేసే సాక్ష్యాలక్కడికెలా వచ్చాయో నాకు తెలియదు. అవి అబద్ధపు సాక్ష్యాలని అతడు నా దగ్గర ఒప్పుకున్నాడు. మీ నుంచి విడాకులు తీసుకుని తన్ను నేను పెళ్ళి చేసుకుంటానన్న ఆశతో అతడు సృష్టించిన అబద్ధపు సాక్ష్యాలు మీరు నమ్మారు. మీరిప్పటికిప్పుడు హైదరాబాదు వెళ్ళి అతడింట్లో పరీక్షించవచ్చు. ఆ ఇంట్లో విస్కీ బాటిల్సుండొచ్చు కానీ బాటిల్సులో విస్కీ ఉండదు. తాగుడు మైకాన్ని నటించి అతడు మీకన్నీ అబద్ధాలే చెప్పాడు."

శ్రీరాములామె మాటలకు వ్యంగ్యంగా నవ్వాడు.

"అలా నవ్వకండి. బావ అన్నీ ఒప్పుకున్నాడు. మీకు చెబుతానన్నాడు. నన్ను నమ్మండి."

"నేను నిన్ను నమ్మను."

"మీదాన్ని నన్ను నమ్మకుండా పరాయివాడు బావని నమ్ముతారా?" అంది సీత ఉక్రోషంగా.

"ఇకమీదట నీ బావని కూడా నమ్మనని హామీయిస్తున్నాను."

సీతకు ఏడుపు వచ్చింది.

"ఏడుపు నీకు ఉపశమనాన్నిస్తుందేమో! నాకు నీ సలహాయే ఉపశమనాన్నిస్తుంది"

సీత కళ్ళు తుడుచుకుంది. గొంతు సవరించుకుంది.

"మీ గతం మాటేమిటి?"

ఆ ప్రశ్న గదిలో ప్రతిధ్వనించింది.

శ్రీరాములు నవ్వి—"నేను మగాణ్ని" అన్నాడు.

గదిలో ప్రతిధ్వనిస్తున్న ప్రశ్న నా సమాధానం పరిహాసించింది.

"మగాడికాడదాని సలహా కావాలా?" అంది సీత.

"మగాడడిగితే సలహా ఇవ్వాలి. అడిగితేనే ఇవ్వాలి. ఇచ్చిన సలహా మగాడు మెచ్చేదిగా ఉండాలి."

"నాకు నలుగురు పిల్లలున్నారు. వాళ్ళ భవిష్యత్తు నాకు ముఖ్యం. మీరనుకునే భయంకర గతం నాకులేదు. ఉందని మీరు నమ్మే పక్షంలో అది గతించిందనుకోండి. భవిష్యత్తులో నావల్ల తప్పు జరుగదు. జరిగితే నేనే ఈ యిల్లు వదిలి పోతాను" అంది సీత.

"నీ సలహా నాకు నచ్చింది. కానీ ఈ ఇంట్లో యిక మీదట నీవు నా సహధర్మచారిణివి కావు. దాసివు" అన్నాడు శ్రీరాములు.

"ఆ రెండు పదాలకూ తేడా ఉంటుందని ఇంతవరకూ ఈ ఇంట్లో నాకు అనిపించలేదు" అంది సీత.

"ఇకమీదట అనిపిస్తుంది" అన్నాడు శ్రీరాములు.

## 5

శ్రీరాములు ఆఫీసునుంచి వస్తూ రెండు ప్యాకెట్లు తెచ్చాడు.

"ఏమిటండీ యివి?" అంది సీత.

"ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకుని రెండేళ్ళయితే ఆ యింక్రిమెంటు ఇప్పటికి అమలు జరిగి అరియర్సు వచ్చాయి. పిల్లలకోసం బట్టలు తెచ్చాను"

అన్నాడు శ్రీరాములు.

సీత ఉత్సాహంగా పిల్లల్ని పిలిచింది.

తండ్రి తమకోసం యేదో తెచ్చాడని పిల్లల హంగా పరుగున వచ్చారు.

శ్రీరాములు పెద్దకొడుక్కి పాంటు, షర్టు ఇచ్చా పెద్దకూతురికి మాక్సీ యిచ్చాడు. బట్టలతోపాటు 7 స్వీట్సు ప్యాకెట్లు కూడా తెచ్చాడు. అతడవి కూ పెద్ద కొడుక్కి, కూతురికే యిచ్చాడు.

చిన్నవాళ్ళిద్దరూ బిక్క మొహాలు వేశారు.

ఆఖరి పిల్ల కాస్త తెగించి—"మాకేవి నాన్నా" అంది.

"బట్టలు మీకు లేవు చిన్నవాళ్ళు కదా! మీ కో త్తబట్టలవసరం. పెద్దవాళ్ళకు పొట్టి అయిన వుంటాం కదా—అవి మీకు!" అన్నాడు శ్రీరాములు.

"మరి బిళ్ళలు!" అన్నాడు రెండో కొడుకు.

"పెద్దవాళ్ళను మంచి చేసుకోండి. వాళ్ళు పెడితే మీకు స్వీట్సు!"

"అలా అంటే వాళ్ళేడిపిస్తారు నాన్నా!"

"చిన్నపిల్లలకు బుద్ధి రావాలంటే పెద్దవాళ్ళను మంచి చేసుకోవాలి! వెళ్ళండి" కసిరాడు శ్రీరాములు.

పిల్లలు నలుగురూ అక్కణ్నుంచి వెళ్ళిపోయారు.

"యేమిటి మీరు చేస్తున్నది?" అంది సీత.

"నా పిల్లల్ని నీ పిల్లల్నుంచి వేరుచేస్తున్నాను."

"వాళ్ళు మన పిల్లలు."

"అందులో ఇద్దరే మన పిల్లలు. ఇద్దరు నీ పిల్లలు."

సీత మాట్లాడలేదు.

"ఈ యింట్లో నా పిల్లలు మహారాజులు. నీ పిల్లలు

వారికి దాసిసల్లె ఊడిగం చేయాలి."

"ఎందుకని?"

"నలుగురూ సమంగా ఉండడం నేను సహించలేను."

"తేడా చూపిస్తే నేను సహించలేను."

"సహించక నువ్వేం చేయగలవు? నువ్వు నా దాసి
వవు."

సీత కళ్ళలో నీళ్ళు తిరిగాయి "అలా మాట్లాడకండి!"
అందామె.

"అలా మాట్లాడితే సహించి ఉండగలిగినప్పుడే నువ్వూ
నేనూ కలిసి ఉండడం సాధ్యపడుతుంది."

"మీరు చాలా క్రూరంగా ప్రవర్తిస్తున్నారు" అంది
సీత.

శ్రీరాములు నవ్వాడు. ఆ నవ్వు కూడా క్రూరంగా
వుంది.

# 6

ఆ రోజు కూడా శ్రీరాములు ఇంటికి రెండు ప్యాకెట్లు
తెచ్చాడు. ఈసారి సీత అవేమిటి అని అడగలేదు.
పిల్లల్ని పిలవలేదు. అతడు పిలవమంటే మీరే పిల్చు
కోండి అందామె.

సీత ఆశ్చర్యపోయే విధంగా అతడు చివరిపిల్లలిద్దర్నీ
పిలిచాడు. తండ్రి పిలుపు వింటూనే వాళ్ళు పరుగున
వచ్చారు.

తను తెచ్చిన రెండు ప్యాకెట్సు నుంచీ చెరో రెండు
స్వీట్సుతీసిచ్చాడు శ్రీరాములు. వాళ్ళు వెళ్ళిపోబో
తూంటే— "ఆగండి. నా కళ్ళెదురుగా మీరిద్దరూ ఇవి
తిని యెలాగున్నాయో చెప్పండి" అన్నాడు.

పిల్లలిద్దరూ స్వీట్సు చకచకా తినేసి "చాలా బాగు

న్నాయి నాన్నా!" అన్నారు.

ఈలోగా పెద్దవాళ్ళిద్దరూ అక్కడికి వచ్చారు. నిన్నటి దినం తమకు జరిగిన మర్యాద ఈ రోజు తమ కంటే చిన్నవాళ్ళిద్దరికీ జరిగేసరికి వాళ్ళోర్వలేక పోయారు. ఇద్దరూ తండ్రిని సమీపించి "మాకో స్వీట్సు" అన్నారు.

"మీకు అప్పుడే కాదు. కాసేపున్నాక" అన్నాడు శ్రీరాములు. వాళ్ళు మారాం చేయబోతే అతడు కసిరాడు.

నలుగురు పిల్లలకూ కూడా తండ్రి దగ్గర చేరిక తక్కువ. వాళ్ళు భయం భయంగా అక్కణ్ణించి వెళ్ళిపోయారు.

"ఎంత లేదన్నా పితృహృదయం! మీ పిల్లల్ని మీ రవమానించలేరు. నిన్న జరిగిందానికి మీ మనసు మథన పడుతోంది" అంది సీత సంతోషంగా.

శ్రీరాములు నవ్వాడు. ఆ నవ్వు క్రూరంగానే ఉంది.

"క్రూరత్వం మీకు సరిపడదు. అలా నవ్వకండి" అంది సీత.

"అసలు జరిగినదేమిటో తెలిస్తే నీవిలా తాపీగా ఉండలేవు" అన్నాడు శ్రీరాములు తాపీగా.

"ఏం జరిగిందో చెప్పండి!"

"ఆఫీసులో పార్టీ కోసం తయారయిన స్వీట్సివి. అందులో కొంత పోర్షన్‌లో విషం కలిసిందని అనుమానం. అది పొరపాటున జరిగింది. మొత్తం స్వీట్సన్నీ అవతల పారేసే బాధ్యత నా కప్పగించారు. అందులో కాసిని తీసి నేను రెండు పొట్లాలుగా కట్టి ఇంటికి తెచ్చాను."

సీత కంగారుగా "నా పిల్లల్ని విషం పెట్టి చంపేయా లనుకుంటున్నారా? నేనిది సాగనివ్వను" అంది.

"అలా కంగారుపడకు. స్వీట్సులో విషం కలవలేదనీ వంటవాడి అభిప్రాయం పొరపాటనీ నా అనుమానం. అందుకే రెండు పొట్లాలింటికి తెచ్చాను. అయితే అను మానమున్నప్పుడు నివృత్తి చేసుకోవాలి కదా! మహారాజు లింట్లో ఇలాంటి వాటికోసమే పిల్లుల్ని పెంచేవారు. నా ఇంట్లో బానిస పిల్లల్ని పెంచుతున్నాను" క్రూరాతి క్రూరంగా నవ్వాడు శ్రీరాములు.

సీత అక్కణ్ణించి పరుగెట్టింది.

శ్రీరాములు వెంటపడి ఆమెను గట్టిగా పట్టుకుని పడక గదిలోకి లాక్కొని వెళ్ళిపోయాడు.

"నన్ను వదలండి!" అందామె గింజుకుంటూ.

"కాసేపు నువ్విక్కడే ఉండాలి" అంటూ అత డామెను మంచంమీదకు తోసి తను గదిలోంచి బయ టకు వచ్చి తలుపులు వేసి గొళ్ళెం పెట్టాడు.

తర్వాత తనక్కడే కూర్చుని పేపరు తీశాడు.

అతడు పేపరు చదువుతూండగా కాసేపటికి పిల్లలు నలుగురూ అక్కడకు వచ్చారు.

"అమ్మేదీ?" అంది ఆఖరుపిల్ల.

"అమ్మకు తలనొప్పిగా ఉండి బెడ్రూంలో పడు కుంది" అన్నాడు శ్రీరాములు.

"అమ్మ కావాలి" అందాపిల్ల ఏడుపుగొంతుతో.

"ఏడవకు" గద్దించాడు శ్రీరాములు.

ఆఖరుపిల్ల ఏడుపు నాపుకుందుకు ప్రయత్నిస్తోంది.

శ్రీరాములు పెద్దపిల్లలిద్దరికేసి చూసి "మీ రిద్దరూ పిల్లిద్దరిచేతా పనులేం చేయించుకోవడం లేదేం?"

అన్నాడు.

"పనులంటే?" అన్నాడు పెద్దకొడుకు.

"మీ బట్టలు మడత పెట్టడం, పుస్తకాలు సర్దడం, పెన్నుల్లో ఇంకు పోయడం, బూట్లు పాలిష్ చేయడం వగైరా వగైరా...."

"భలే భలే" అంది పెద్దకూతురు.

"మీరు వీళ్ళచేత అన్ని పనులూ చేయించుకుంటే కోడా మీద మంచి బహుమతు లిస్తాను" అన్నాడు శ్రీరాములు.

"అమ్మ రావాలి" అంది ఆఖరి కూతురు యేడుపు నాపుకోలేక.

శ్రీరాములు చేతిలోని పేపరు మడతపెట్టి పెద్ద కొడుక్కిచ్చి—"ఇది దాచు" అన్నాడు. వాడది తీసుకని వెళ్ళబోతూంటే—"నేను చెప్పిందప్పుడే మర్చిపోయావా?" అన్నాడు.

"ఏమిటి?" అన్నాడు వాడర్థంకాక.

"నీ పనులు నువ్వు నీకంటే చిన్నవాళ్ళకు చెప్పాలి."

"ఈ పేపరు దాచిరావే" అన్నాడు వాడు వెంటనే తన పెద్దచెల్లిపై అథార్టీ చేస్తూ.

"మగపిల్లల్లో నువ్వు పెద్ద. ఆడపిల్లల్లో అది పెద్ద. మీ రిద్దరూ ఒకరిమీద ఒకరు అథార్టీ చేసుకోకూడదు. ఒకరిపను లొకరు చేయకూడదు. ఏ పనులైనా మీరు చిన్నవాళ్ళిద్దరికీ చెప్పి చేయించుకోండి."

"అయితే ఒకేయ్ ఈ పేపరు దాచరా" అంటూ పెద్దవాడు తమ్ముడిమీద అథార్టీ చేశాడు.

"నాన్నా! నాకూ యేదైనా పని చెప్పు. చెల్లికి చెబు

తాను" అంది పెద్దకూతురు సరదాగా.

"ఇప్పటికేం పనిలేదు. కావాలంటే నీ కాళ్ళు నొక్కమను."

"ఓసేవ్ వాళ్ళ కాళ్ళు లాగుతున్నాయ్. నా కాళ్ళు నొక్కవే!" అంది పెద్దకూతురు వెంటనే. చిన్నది ఏడుస్తూ—"అమ్మ కావాలి" అంది.

"నాతో రా!" అన్నాడు శ్రీరాములేమనుకున్నాడో.

ఇద్దరూ గుమ్మందాకా వెళ్ళారు. శ్రీరాములు గొళ్ళెం తీశాడు.

సీత అంతవరకూ తలుపుల దగ్గరే ఉన్నట్లుంది. గొళ్ళెం తీసిన చప్పుడయిన వెంటనే భళ్ళున తలుపులు తెరుచుకున్నాయి.

"అమ్మా! అంతా నన్నేడిపిస్తున్నారు" అందాఖరి కూతురు ఏడుపు గొంతుతో. కానీ ఆశ్చర్యంతో దాని ఏడుపు వెంటనే ఆగిపోయింది. ఎందుకంటే దానికంటే ఎక్కువగా సీత వెక్కి వెక్కి ఏడుస్తోంది.

## 7

ఇంట్లో జరిగే సంఘటనలు సీతకు బాధాకరంగా పరిణమించాయి. శ్రీరాములులో మార్పు వస్తుందని ఆశిస్తూంటే రోజు రోజుకీ పెచ్చుమీరిపోతున్నాడతడు.

సీత ఆఖరి పిల్లలిద్దరికీ కష్టాలు ప్రారంభమయ్యాయి. శారీరకంగా శ్రమను మించి మానసికంగా హింసించబడుతున్నారు వాళ్ళు. ఇంట్లో అంతవరకూ సమాన హోదాలో పెరిగి అప్పుడున్నట్లుండి అవమానాలకు గురవడం వాళ్ళు తట్టుకోలేకపోతున్నారు. ఎవరైనా కలిసి ఎన్ని కష్టాలయినా భరించగలరు. కానీ అన్నదమ్ముల్లో, అక్క

చెల్లెళ్ళలో, అయినవారిలో ఒకరి సథితులుగా, ఒకరి నధములుగా గుర్తిస్తే ఆ బాధ అనుభవించినవారికే తప్ప అర్థంకాదు. అందులోనూ లేత మనసులు!

సీత తన పెద్దపిల్లలిద్దర్నీ అదుపుచేయాలని చూసింది. కానీ తండ్రి ప్రోత్సాహంతో వారూ పెచ్చరేగిపోతున్నారు.

"మీ ద్వేషం కారణంగా మనింట్లో అంతా చెడిపోతున్నారు. చిన్నవాళ్ళ మనసుల్ని కలుషితం చేయకండి" అంది సీత.

"ఈ రోజున చెబుతున్నాను విను. మన యిల్లొక సౌతాఫ్రికా. ఈ యింట్లో నేను, నా యిద్దరు పిల్లలు తెల్లవాళ్ళు. నువ్వు నీ యిద్దరి పిల్లలు నల్లవాళ్ళు. తెలిసిందా....?" అని గద్దించాడు శ్రీరాములు.

ఏం చేయాలో తెలియక సీత అర్ధంటుగా బయల్దేరి రావలసిందిగా తల్లికి ఉత్తరం రాసుకుంది.

సీతకు తండ్రి లేడు. తల్లి మంచి వ్యవహారజ్ఞురాలు. ఉత్తరం చదవగానే సీత తల్లికి అర్థమయింది—కూతురి కాపురంలో యేవో కష్టాలున్నాయని! ఆమె తక్షణం కూతురి దగ్గరకు బయల్దేరింది. కూడా ఆఖరి కొడుకు గౌతమ్‌ని కూడా తీసుకుని వెళ్ళింది.

గౌతమ్ బీకాం ప్యాసై యేడాదయింది. అతని ఉద్యోగం దొరకడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ వ్యాపారం చేయాలని అతడనుకుంటున్నాడు. ఇంకా యే నిర్ణయానికీ రాలేదు. గౌతమ్‌కీ, శ్రీరాములుకీ మంచి స్నేహం. అత్తారింటికి వెళ్ళినప్పుడల్లా శ్రీరాములు గౌతంతో గంటల తరబడి మాట్లాడుతూంటాడు. గౌతమ్ యెంతలేని మాటలన్నా అతను ముచ్చటపడడమే తప్ప

కోపగించుకోడు.

అందుకే సీత తల్లి గౌతమ్‌ని వెంటబెట్టుకొని వెళ్ళింది.

వాళ్ళిద్దరూ సీత ఊరు చేరుకునేసరికి సాయంత్ర మయింది. ఇల్లు చేరుకునేసరికి శ్రీరాము లింట్లోనే ఉన్నాడు. అత్తగారినీ, బావమరిదినీ చూసి మాటవరస కూడా పలకరించలేదు.

సీత తల్లి తనకు తానై "కులాసా బాబూ!" అని పలకరిస్తే అతడు విననట్లూరుకున్నాడు.

"ఏం బావా—పీకు చెవుడొచ్చిందా?" అన్నాడు గౌతమ్ నవ్వుతూ.

శ్రీరాములతడికూడా బదులివ్వలేదు. విసురుగా లేచి లోపలకు వెళ్ళిపోయాడు. మరో అయిదు నిముషాల్లో అతడు తన యిద్దరు పిల్లల్నీ తీసుకుని ఇంట్లోంచి వెళ్ళి పోయాడు.

పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు అర్థమయింది సీతతల్లికి. కూతుర్ని పలకరించగా ఆమె యేడుస్తూ జరిగిందీ, జరుగుతున్నదీ చెప్పింది.

గౌతమ్ ఆవేశపడ్డాడు. తల్లి ఆవేదన చెందింది.

"అమ్మా! మీ రెలాగో ఆయనలో మార్పు తీసుక రావాలి" అంది సీత.

"అల్లుడికి నే చెబుతా లే" అంది తల్లి.

"మాటలతో వినకపోతే అప్పుడు నే నున్నాను" అన్నాడు గౌతమ్.

"ఒరేయ్—నువ్వేం కలగజేసుకోకు. అన్నీ నేను చూసుకుంటాను" అంది తల్లి కంగారుగా.

"అవసరమనిపిస్తే తప్ప కలగజేసుకోను. అవసరమని పించేనప్పుడు మాత్రం నన్నా దేవుడు కూడా ఆపలేడు"

అన్నాడు గౌతమ్.

రాత్రి తొమ్మిది కల్లా చేరాడు శ్రీరాములు. అతడు, పిల్లలు బయట భోంచేసి వచ్చారు.

అల్లుడు ముభావంగా ఉన్నాడని తెలిసి కూడా తప్పనిసరై సీత తల్లి అతణ్ణి పలకరించింది.

"నా కిప్పు డెవరితోనూ మాట్లాడాలని లేదు" అన్నాడు శ్రీరాములు.

"కానీ తప్పదు. ఒక్కసారి నా మాట వినాలి నువ్వు" అంది సీత తల్లి.

"నాకా అవసరం లేదు."

"అవసరం నాదే—ఒప్పుకుంటున్నాను. ఒక్కసారి నా మాట విను."

శ్రీరాములదోలా నవ్వి—"అత్తయ్యా! మీకు భర్త పోయి ఆరేళ్ళయింది. అందుకు నా సానుభూతి. అయితే మీ అవసరాలు నా ద్వారా తీరాలని నన్ను బలవంత పెడితే మీరంటే నా కసహ్యం వేస్తుంది. సమాజం విధించిన నీతి నియమాలు నాకు చాలా ముఖ్యం" అన్నాడు.

సీత తల్లి మ్రాన్పడిపోయింది.

తల్లి పక్కనే ఉన్న గౌతమ్ బావగారన్న మాటలకు ఆవేశంతో ఊగిపోతూ "అన్న మాటలు వెనక్కి తీసుకుని అమ్మకు క్షమార్పణ చెప్పరా! లేకుంటే ఈ క్షణమే నిన్ను చంపేస్తాను" అన్నాడు.

"మీ యింట్లో ఆడాళ్ళు చరిత్రహీనులని నాకు తెలుసు. మగాళ్ళు హంతకులయితే ఆశ్చర్యపోను."

"ఏం కూశావ్?"

గౌతమ్ ముందడుగు వేయబోతూంటే చేయి పట్టుకుని

ఆపింది తల్లి.

"నన్నాపకమ్మా!" అన్నాడు గౌతమ్.

"ఆమె ఆపినా ఆపకపోయినా అసలు విషయం తెలిస్తే నువ్వే ఆగిపోతావు. నీ తండ్రి ఫలానా అని మీ అమ్మ కచ్చితంగా నీకు చెప్పగలదేమో అడుగు" అన్నాడు శ్రీరాములు.

గౌతమ్ ఆవేశం పెరిగిపోయింది. కానీ అతణ్ని తల్లి చేయి పట్టుకుని చరచరా ఈడ్చుకొని వెళ్ళిపోయింది.

అంతవరకూ గుమ్మం దగ్గర నిలబడ్డ సీత లోపలకు వచ్చే—"మీరు హద్దులు దాటిపోతున్నారు" అంది.

"హద్దు లాడవాళ్ళకే—మగాళ్ళకు లేవు."

"ఏ ఆధారంతో మీరు మా అమ్మనంత లేని మాట అన్నారు?"

"పండును చూసి చెట్టు పేరు తెలుసుకోవచ్చు!"

"ఓహ్—అయితే మిమ్మల్ని చూసి మీ అమ్మగురించి నేనూ తెలుసుకోవచ్చు నన్నమాట!"

సీత చెంప చెళ్ళుమంది.

"కొట్టండి. అయినా మళ్ళీ మళ్ళీ అంటాను. మీ అమ్మ కులట."

మరోసారి సీత చెంప చెళ్ళుంది.

సీత అనడం మానలేదు. అతడు కొట్టడం మానలేదు.

చివరకు పకపకలమే నెగ్గింది. సీత స్పృహతప్పి పడిపోయింది.

# 8

మర్నాడుదయం....

పిల్లలందరూ స్కూలుకి వెళ్ళిపోయారు. శ్రీరాములు ఆ వెంటనే ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

"అక్కా! ఈ పశువుతో నువ్వు కాపురం చేయలేవు. మాతో బయల్దేరి వచ్చేసెయ్" అన్నాడు గౌతమ్.

"మీరు వెళ్ళిపొండి. నా కారణంగా మీ కవమాన మయింది" అంది సీత బాధగా.

"మా గురించి నాకేం బాధ లేదమ్మా! ఆడపిల్ల నిచ్చుకున్నవాళ్ళం దేనికైనా సహించాలి. కానీ నిన్న రాత్రి నువ్వు నీ అత్తగార్ని నిందించావు. అల్లుడు దిగ జారాడని నువ్వూ దిగజారితే అతడికీ నీకూ సంస్కా రంలో తేడా యేముందమ్మా?" అంది సీత తల్లి.

"మాటకు మాట బదిగా చెప్పిందక్క. ఇంక నేను దెబ్బకు దెబ్బ తీస్తాను. అమ్మా! నువ్వు నన్నాపద్దు" అన్నాడు గౌతమ్.

"మనమిక్కడికి వచ్చింది దాని కాపురం నిలబెట్ట డానికి. కూలదోయడానికి కాదు. తెలుసా?" అంది సీత తల్లి.

ఆమె సీతకు భర్తతో ఎలా మసులుకోవాలో మరి కొన్ని నీతులు చెప్పి కొడుకును తీసుకుని వెళ్ళిపోయింది.

సాయంత్రం భర్త ఆఫీసు నుంచి తిరిగిరాగానే— "అనవసరంగా అత్తగార్ని మాట లన్నాను. నన్ను క్షమించండి" అంది సీత.

శ్రీరాము లాశ్చర్యంగా ఆమెవంక చూశాడు.

"మీరు మా అమ్మనవమానించారు. ఆ ఆవేశంలో నా మనసు వశం తప్పింది. అప్పుడు నేనేం మాట్లా డాలో నాకే తెలియదు. నన్ను మన్నించండి" అంది సీత.

"తప్పు తెలుసుకున్నావు. వెరీ గుడ్!" అన్నాడు శ్రీరాములు.

"మీరు కూడా ఆవేశంలో మా అమ్మనవమానించారు. క్షమార్పణ అడుగుతూ ఒక్క ఉత్తరం రాయండి. ఆవిడెంతో సంతోషిస్తుంది" అంది సీత.

"ఇందుకా నువ్వు నాకు క్షమార్పణ చెప్పావు...."

"అవును. నా తప్పును నేను తెలుసుకున్నాను. మీ తప్పును మీరు తెలుసుకోవాలి."

శ్రీరాములామెను సమీపించి రెండు చేతులతోటీ ఆమె జుట్టును గట్టిగా పట్టుకుని—"మనమిద్దరం సమానులం కాదు. నువ్వు బానిసవు. నేను యజమానిని" అన్నాడు.

"అయితే?"

"మరోసారి సమానత్వం గురించి మాట్లాడితే నీ తలను గోడకేసి కొడతాను" అన్నాడతడామె జుట్టునింకా వదలకుండానే.

"అప్పుడు మీరు హంతకులవుతారు."

"నేను నిన్ను చంపను. హింసిస్తాను."

సీత ఏడుస్తూ "ఇంక మన కాపురం యెప్పటికీ ఇంతేనా?" అంది.

"నువ్వు బానిసలా పడుండి నేను చెప్పినట్లల్లా వింటూంటే నిన్ను కొట్టను. తిట్టను. ఇంట్లోంచి గెంటను. నీకు, నీ పిల్లలకు సమాన హోదా మాత్రం అడక్కు" అన్నాడు శ్రీరాములు.

సీత మారుమాట్లాడకుండా చీర చెంగులో కన్నీళ్ళొత్తుకుంది.

శ్రీరాములామె జుట్టు వదిలిపెట్టి "నేను రాక్షసుణ్ణి కాదు. స్వేచ్ఛావిహారం చేసి నువ్వే రాక్షసవనితలా ప్రవర్తించావు. మానసికంగా నిన్ను భరించడం నాకు

కష్టంగా ఉంది. అందుకే నిన్ను మానసికంగా హింసించి కొంత తృప్తి చెందుతున్నాను. మరో మగాడైతే నీలాంటి దానికి నేనిచ్చిన స్థానం ఇస్తాడనుకోను" అన్నాడు.

"నాకై నేను తెగించి నా కాపురంలో నిప్పులు పోసుకోలేకపోతున్నాను. మీ రందరి మగాళ్ళలాగే ప్రవర్తించి ఉంటేనే నాకు బాగుండేది. నన్ను నేను తప్పుపట్టుకోనవసరం లేకుండా మీకు దూరమయ్యేదాన్ని" అంది సీత.

"ఇప్పుడు నీకేం లోటు? తిండి, గుడ్డ, నీడ అన్నీ ఉన్నాయి నీకు. నీ పిల్లల్లో యిద్దరు మహారాజభోగంలో వెలిగితే మరో యిద్దరు సామాన్యులే అయినా తిండికీ గుడ్డకీ లోటులేకుండా వుంటారు" అన్నాడు శ్రీరాములు.

"మనిషి మనిషిని భరించవచ్చు. రాక్షసుణ్ని భరించవచ్చు. కానీ రాక్షసుడిలాంటి మనిషిని భరించడం అసాధ్యం" అంది సీత.

## 9

సూర్యప్రకాశరావు ఉత్సాహంగా ఆటో దిగాడు. శ్రీరాములాయన కెదురై — "టెలిగ్రాం ఇప్పుడే అందింది నాన్నా — ఇంకా సేపటికి బయల్దేరాలనుకుంటున్నాను. ట్రయిన్ టైముకే వచ్చేసిందా" అన్నాడు.

"ఊఁ అమ్మాయింట్లోనే వుందా!" అన్నాడు సూర్య ప్రకాశరావు.

"ఉంది" అన్నాడు శ్రీరాములు ముభావంగా.

ఇద్దరూ లోపల అడుగు పెట్టాక — "ఇలాంటి కాపురం ఎన్నాళ్ళు? నీ ఉత్తరం చూడగానే నేను నీ సమస్యకు పరిష్కార మార్గం ఆలోచించాను" అన్నాడు సూర్యప్రకాశరావు.

"కూర్చోండి నాన్నా!" అన్నాడు శ్రీరాములు.

సూర్యప్రకాశరావు కుర్చీలో కూర్చుని "అనుకో కుండా ఓ విశేషం జరిగింది. మా పెద్దన్నయ్య పెద్ద కొడుక్కి పిల్లలు లేరుగదా! అన్ని పరీక్షలూ చేయించు కున్నాడు. లోపం వాడిలోనే వుందిట. తన యోగం అంతేనని ఊరుకున్నాడు. కానీ నెల్లాళ్ళక్రితం వాడి తరఫు దూరపు బంధువు చనిపోతూ పదిలక్షల ఆస్తి ఇచ్చిపోయాడు. అంత ఆస్తికి వారసుడు లేకుండా పోవడం వాడికి నచ్చలేదు. వాడు నీ పెద్దపిల్లలిద్దర్నీ దత్తత చేసుకుంటాట్ట. నువ్వింకో పిల్లను పెళ్ళిచేసుకుని హాయిగా ఉండొచ్చు. ఆపరేషన్ చేయించుకున్నానన్న సంగతి పెళ్ళికిముందు చెప్పక్కర్లేదు. అటు నీ పిల్లలకు సవతిపోరూ ఉండదు. నీకు కాస్త మంచిపిల్ల భార్యగానూ వుంటుంది. అన్నింటికీ అణిగిమణిగి పడివుంటే సీత నీతో ఉంటుంది. దాని పిల్లల్ని నువ్వు ఆదరించవచ్చు. లేదా విడాకులిచ్చేసేయ్" అన్నాడు.

"నా పిల్లల్ని నేను దత్తతిచ్చేస్తే మరి నాకు పిల్లలుండరు. అప్పుడు సీత పిల్లలే నాకు గతి" అన్నాడు శ్రీరాములు.

"సీత పిల్లలు నీ పిల్లలు కాదన్న గ్యారంటీ ఏమీ లేదుకదా! లేనిపోని శంకలు మనసులో పెట్టుకోకు. ఆడాళ్ళు తప్పులుచేస్తే మగాళ్ళు వాటిని తెలివిగా ఉపయోగించుకోవాలి. నువ్విప్పుడు మళ్ళీ పెళ్ళిచేసుకుంటే యాభై వేలు కట్నం...."

"యాభై వేలా?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీరాములు.

మొదటి పెళ్ళికే అతడికి పదిహేను వేలు కట్నం వచ్చింది. రెండో పెళ్ళికి యాభై వేలెవరిస్తారు?

"అవును. అలాగని పెళ్ళిలాగుంటుందని కంగారుపడకు. నేనే స్వయంగా చూశాను. చిదిమిదీపం పెట్టుకునేలా ఉంటుంది."

"మరైతే?"

"ఆఁ ఉన్నవాళ్ళమీద గిట్టనివాళ్ళు ప్రచారాలు చేస్తూనే ఉంటారుగదా! అలాగే ఆ పిల్లమీద కూడా యేవో అపవాదులున్నాయి. కళ్ళతో చూస్తే తప్ప ఏదీ నిజమని నమ్మకూడదంటాను నేను. పిల్లను చూశానుగదా! ఎంతో అమాయకంగా వుంది ముఖం. చూడగానే దేవత అనిపిస్తుంది. అలాంటి దేవతమీద అపవాదులు వేయడానికి మనుషులవల్ల కాదు. వాళ్ళు డబ్బిచ్చి మంత్రుల్నే కొనేయగలరు. కానీ సంప్రదాయమంటే ప్రాణులాదే వాళ్ళు కావడంవల్ల నీవంటివాడికోసం వెతుకుతున్నారు. నీవంటివాడైతే—రెండో పెళ్ళి వాడేం—మూడో పెళ్ళి వాడైనా ఫరవాలేదని వియ్యంకుడుగారు నాతో అన్నాడు."

శ్రీరాములంతా విని ఊరుకున్నాడు.

"నీ అభిప్రాయం చెప్పుమరి!" అన్నాడు సూర్యప్రకాశరావు.

"అంతా మీ యిష్టం" అని అన్నాడు శ్రీరాములు.

"అయితే ఒక్కసారి కోడలితో కూడా మాట్లాడతాను.

"నేనీ యింట్లో బానిసను. నాతో మాట్లాడ్డానికేముంటుంది?"

సూర్యప్రకాశరావులిక్కిపడి అటు తిరిగాడు. గుమ్మంలోంచి సీత వారిని సమీపిస్తోంది.

"అయితే అంతా విన్నాకన్నమాట!" అన్నాడు సూర్యప్రకాశరావు.

"మీకు మంచినీళ్ళు తెస్తున్నాను. కానీ అప్పటికే మీ సంభాషణ ప్రారంభమైపోయింది" అంది సీత.

"సరే— నేను చెప్పిందానిపై నీ అభిప్రాయమేమిటి?"

"బానిసను— నాకు అభిప్రాయాలేముంటాయి?" అంది సీత.

"నువ్వు బానిసవేంటమ్మా! ఇప్పుడు నీ భర్త మరో పెళ్ళి చేసుకోవాలంటే నువ్వే అనుమతినివ్వాలి" అన్నాడు సూర్యప్రకాశరావు.

"నేను బానిసను కాని పక్షంలో నా సందేహాలు తీర్చాలి మీరు!"

"అడుగు" అన్నాడు సూర్యప్రకాశరావు.

"అసలు నా భర్తకు రెండో పెళ్ళెందుకు? నేను కులటనన్న అనుమానం — అంతేకదా! చేసుకోబోయే పిల్లక్కూడా కులట అన్న అపవాదుంది. అది నమ్మకూడదని మీరనుకుంటున్నారు. అలాంటప్పుడు నామీద అపవాదను మాత్రం ఎందుకు నమ్మాలి? ఆ పిల్ల యాభై వేలు విలువ చేయవచ్చు. కానీ తర్వాత జీవితాంతం మీరే పోషించాలి గదా? నేనైతే లక్షలు విలువచేసే పిల్లల్నిచ్చాను. నా విలువను గుర్తించరేం?"

సూర్యప్రకాశరావు నవ్వి— "నీ తప్పు తెలిసి కూడా నిన్నేలుకుంటున్న నీ భర్త ఔదార్యం అరుదైనది. ఆ ఔదార్యానికి నువ్వు తలవంచాలి. ఇక పిల్లల విలువంటావా? బిడ్డల విలువ తండ్రినిబట్టే కానీ తల్లినిబట్టి కాదు. రోడ్డుపక్కన అడుక్కుతినే ముష్టిది కూడా పిల్లల్ని కంటుంది. అదో పెద్ద విశేషం కాదు" అన్నాడు.

"అయితే మీరేమంటారు?"

"నీ పెద్ద బిడ్డలిద్దర్నీ దత్తతకిచ్చి, నీ భర్త రెండో పెళ్ళికంగీకరించి, చివరిద్దరి పిల్లలతోటి నీ భర్త వద్ద జీవిత శేషకాలం వెళ్ళబుచ్చు."

"అన్నింటికీ నేనంగీకరిస్తాను. కానీ నా చిన్న పిల్లలిద్దర్నీ దత్తత ఇచ్చి పెద్దవాళ్ళిద్దర్నీ దగ్గరుంచుకుంటాను" అంది సీత.

"అలా వీల్లేదు" అన్నాడు శ్రీరాములు.

"ఎందుకని?"

"చిన్నవాళ్ళిద్దరూ లక్షాధికార్లు కావడం నేను సహించలేను. వాళ్ళిద్దర్నీ నా దగ్గరే వుంచుకుని వాళ్ళ జాతకాలను నేను శాసిస్తూంటాను" అన్నాడు శ్రీరాములు.

"వాళ్ళు చేసిన తప్పేమిటి?"

"వాళ్ళ పుట్టుకకు కారణమే తప్పు...."

సీత చటుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

## 10

ఆ రోజు ఆదివారం.

పిల్లలకు స్కూలు లేదు. శ్రీరాములుకాఫీసులేదు.

ఎన్నడూ లేనిది శ్రీరాములారోజు పెందరాళే లేచి స్నానాదులు నిర్వర్తించుకుని తండ్రితో మంతనాలాడుతున్నాడు.

సూర్యప్రకాశరావు కోడల్ని పిలిచాడు.

సీత వెళ్ళింది.

"నీ నిర్ణయం చెప్పు!" అన్నాడాయన.

"నా నిర్ణయం నిన్ననే చెప్పాను."

"ఏమిటది?"

"చిన్నవాళ్ళిద్దర్నీ దత్తతిస్తాను. పెద్దవాళ్ళు నాతో

వుంటారు. వారింతో పెళ్ళి చేసుకుంటే నే నభ్యంతర పెట్టను."

"నీ భర్త మరో పెళ్ళి చేసుకుంటే నిజంగా అభ్యంతర పెట్టవా?"

సీత నవ్వి — "తన సంస్కారం తెలిసినప్పట్నించీ వారిని చూస్తూంటేనే నా కంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకినట్లుంటోంది. ఈ సమాజంలో వుంటున్నాను కాబట్టి గతిలేక వారిని భర్తగా చెప్పుకుంటాను. వారు నాకు భర్త కాని భర్తగా ఉంటే అంతకంటే సంతోషించవలసిన విషయమేముంది?"

శ్రీరాములు కోపంగా "ఏమైనా సరే—పెద్దపిల్లల్నే దత్తతివ్వాలి. చిన్నవాళ్ళనివ్వడం కుదరదు" అన్నాడు.

"చిన్నవాళ్ళు దత్తతకు వెడితే అక్కడ సుఖంగా వుంటారు. పెద్దవాళ్ళు మనదగ్గరుంటే మీకల్లా సుఖపడతారు."

"ఇక్కడ శాసించేది నువ్వు కాదు" అన్నాడు శ్రీరాములు.

"అమ్మాయ్—నీ అదృష్టాన్ని నువ్వు గుర్తించడంలేదు. అబ్బాయి సంస్కారాన్ని నువ్వర్థం చేసుకోవడంలేదు" అన్నాడు సూర్యప్రకాశరావు.

"సంస్కారం—నా పిల్లల్లో ఇద్దరు కాముకులై తమ తోడబుట్టిన వాళ్ళనే వేధించేలా చేయడం సంస్కారమా? నా కన్నతల్లిని చరిత్రహీనురాలనడం సంస్కారమా? అగ్ని సాక్షిగా వివాహమాడిన భార్య సమాన హోదా అడిగితే నువ్వు బానిసవనడం సంస్కారమా?" అంది సీత.

"కానీ నీ అదృష్టం!"

"అదృష్టమా? నా హృదయంలో ఎన్ని అగ్నిపర్వతాలు రగులుతున్నాయో మీకేం తెలుసు?"

"ఏమిటే—అంత అగ్నిపర్వతాలు రగలాల్సి వచ్చిన అవసరం నీకేమొచ్చింది?" అన్నాడు శ్రీరాములు.

"కొంతకాలంగా మీతో కాపురంచేస్తున్న ప్రతి క్షణం నాలో అగ్నిపర్వతాన్ని రగులుస్తోంది."

"నాన్న దగ్గర సింపతీ కొట్టేయాలని చూడకు—"

సీత అదోలా నవ్వి—"ఎవరి సింపతీ నాకవసరంలేదు. నా ఏర్పాట్లు నేను చూసుకోగలను. దత్తతకు చివరి పిల్లలిద్దర్నీ మాత్రమే యివ్వండి. పెద్దవాళ్ళ నిద్రామన్నా వీలుపడదు" అంది.

"ఎందుకు వీలుపడదు?"

"పాడిపంటలతో మానవజాతిని ఆదరించే భూమాత హృదయంలో అగ్నిపర్వతం బద్దలైతే ఆమె కన్నబిడ్డలే ఆ లావాలో మాడిపోతారు. ఇప్పుడూ అంతే జరిగింది. రాత్రి తిన్న విషంతో యింతవరకూ నిద్ర లేవలేదు పెద్దవాళ్ళిద్దరూ!"

శ్రీరాములు మ్రాన్పడిపోయాడు.

"పాపిష్టిదానా! కన్నబిడ్డలకు విషం పెట్టావా?" అన్నాడు సూర్యప్రకాశరావు.

"ఈ ప్రపంచానికి వారి అంశ మిగల్చకూడదని నేను చేసిన ఈ పాపం నన్నే నరకానికి తీసుకువెళ్ళినా అది నా కడుపు చిచ్చును మించి బాధ పెట్టదు. ఇక మీకు మిగిలినదిద్దరు బిడ్డలు. వాళ్ళను మీరే చంపుకుంటారో యేమౌతారో నాకు తెలియదు. అది చూడ్డానికి నేనూ ఉండను. నేను నా పగ తీర్చుకున్నాను. ఇప్పుడు నాకు తృప్తిగా ఉంది. కన్నబిడ్డలనే చంపుకున్న మహాపాత

కిగా మీరు నా గురించి చెప్పుకోవచ్చు. అలా చెప్పుకునే ముందు ఒక్కసారి మీరూ మీ గురించి ఆలోచించుకోండి. ఒక బిచ్చగత్తె పిడికెడు మెతుకులకోసం తన బిడ్డనే వికలాంగుణ్ణి చేస్తోంది. సమాజంలో ఆ బిచ్చగత్తె స్థానానికీ, ఇక్కడ మీ యింట్లో నా స్థానానికీ తేడా లేదు" అంది సీత.

"నువ్వు నిజమే చెబుతున్నావా?" అన్నాడు శ్రీరాములు తేరుకుని.

"నిజం తెలుసుకోవాలంటే పిల్లల గదిలోకి వెళ్ళండి" అంటూ చటుక్కున నేలమీద పడిపోయింది సీత.

సూర్యప్రకాశరావామెను సమీపించబోయి ఆగాడు.

అప్పుడే పేలిన అగ్నిపర్వతంలా ఉంది సీత!

—: ఐపోయింది :—